క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో నిలిపివేత

అచ్చంపేట రూరల్: మండలంలోని నడింపల్లి, హాజీపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నడింపల్లి 33కేవీ విద్యుత్ లైన్లను మరమ్మతు చేయనున్నామని తెలిపారు. రైతులు, వ్యాపారులు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కొల్లాపూర్: పట్టణంలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఓమేష్‌గౌడ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

వెల్దండ: మండలంలోని బొల్లంపల్లి, బైరాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ జానకిరామ్‌నాయక్ తెలిపారు.

ఉపాధి కూలి రూ.600 ఇవ్వాలి

ఉప్పునుంతల: జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు రోజుకు రూ. 600ల చొప్పున కూలి ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మర్రిపల్లిలో ఉపాధి హామీ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనుల వద్ద తాగునీరు, నీడ వసతి తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారికి జాప్యం చేయకుండ జాబుకార్డులను జారీచేసి వెంటనే వారిని పనులు కల్పించాలన్నారు. నాయకులు, కూలీలు ఉన్నారు.

ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి

కొల్లాపూర్: విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయించాలని ఎంఈఓ ఇమ్మానుయేల్ సీఆర్‌పీలకు సూచించారు. గురువారం ఆయన పట్టణంలోని ఎమ్మార్సీ కేంద్రంలో కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాలకు చెందిన సీఆర్‌పీలతో ఆయన సమావేశం అయ్యారు. ఆపార్ ఐడీ నమోదు, బేస్‌లైన్ టెస్టు, మిడ్లైంట్ టెస్టు, ఎండింగ్ టెస్టు, ఎఫ్‌ఏ ఎగ్జామ్స్, ఫలితాల నమోదు వంటి అంశాల గూర్చి చర్చించారు. ఈ నెలాఖరులోగా విదద్యార్థులకు ప్రతిభా కార్డులు అందేలా చూడాలని ఎంఈఓ ఆదేశించారు. ఆన్‌లైన్ నమోదు అంశంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో సీఆర్‌పీలు పానుగంటి వెంకటస్వామి, రామకృష్ణ, అలీ, సుమిత్ర తదితరులు ఉన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

తెలకపల్లి: తలకొండపల్లి మండల కేంద్రంలో భీమ్ దీక్ష ముగింపు సభను విజయవంతం చేయాలని స్వేరోస్ జిల్లా కార్యదర్శి శివశంకర్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ఆలేరులో భీమ్ దీక్ష వాల్ పోస్టర్ విడుదల చేశారు. జిల్లా నుంచి భారీగా తరలి విజయవంతం చేయాలన్నారు. నాయకులు రమేష్, తిరుపతి, ప్రవీన్, వినోద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు

కొల్లాపూర్: మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రామ్ వంటి జీవిత చరిత్రలు తెలియజేసేలా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేశారు. మెరుగైన ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్ వెల్లడించారు. పరీక్షలను కళాశాల అధ్యాపకులు పర్యవేక్షించారు.

మల్కాపూర్‌లో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని మాల్కాపూర్‌లో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ నిర్మాణాలను సక్రమంగా చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో రిలే నిరహార దీక్షలను ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందికొండ గీత, పాదిలి రామయ్య, నాగరాజు గౌడ్, శ్రీనివాసులు, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

తెలకపల్లి: మండలంలోని జమిస్తాపూర్‌లో ఉపాధి హామీ పథక పనులను ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. గ్రామంలో ఉన్న నర్సరీని సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీత, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

రేపు సామూహిక వ్రతాలు

కందనూలు: నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల సీతారామచంద్ర స్వామి దేవాలయంలో విశ్వావసు సంవత్సర చైత్ర పౌర్ణమి సందర్భంగా ఈనెల 12న ఉదయం10.30 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు కందడై వరదరాజన్ అయ్యంగార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

శిథిలావస్థలో 'గ్రంథాలయం'

- లైబ్రేరియన్‌ను నియమించని అధికారులు
- అటెండర్‌తో నెట్టుకొస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనం

కోడేరు: ప్రతి ఒక్కరికి విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయం ఇప్పుడు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. పాలకులు మారుతున్నా గ్రంథాలయం తీరు మారడం లేదు. దీంతో పాఠకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయం 40 ఏళ్ల కిందట భవనం నిర్మించారు. ఆ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని పాఠకులు భయాందోళనకు గువుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా భవనం పైకప్పు నుంచి గోడల నుంచి నీరు కారడంతో పాటు పెచ్చులూడిపోతుంది. గ్రంథాలయంలోని పుస్తకాలు, వివిధ దినపత్రికలు తడిసి ముద్దవుతున్నాయని పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనానికి మరమ్మతులు చేయాలని పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఎవరు పట్టించుకోవడం లేదు. ఈ భవనంలో ఒక గది ఉండటంతో పుస్తకాలు, పత్రికలు పెట్టడానికి అసౌకర్యంగా ఉందని అన్నారు. సౌకర్యాలు లేకపోవడంతో గ్రంథాలయానికి పాఠకులు రావడం రోజు రోజుకు తగ్గిపోతుందన్నారు.

ఇబ్బందుల్లో పాఠకులు

గ్రంథాలయానికి ప్రతి రోజు పాఠకులు వస్తున్నా ఒకేగది ఉండటంతో పాఠకులకు కనీసం కూర్చోవడానికి స్థలం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త భవనం నిర్మిస్తే పాఠకులకు ఇబ్బందులు తొలగే అవకాశం ఉంది.

అటెండరే దిక్కు..

కొన్నేళ్లుగా గ్రంథాలయ అధికారులను నియమించకపోవడంతో అటెండర్‌తోనే కాలం వెళ్లదీస్తున్నారు. 30 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న అటెండర్‌ను ప్రభుత్వం నేటికి పర్మినెంట్ చేయలేదు. అయినా అతను ప్రతినిత్యం గ్రంథాలయాన్ని తెరచి పుస్తకాలు, దినపత్రికలు పాఠకుల కోసం సిద్ధంగా ఉంచుతున్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు లేకపోవడంతో బాగా ఇబ్బందులు పడుతున్నారు. 40ఏళ్ల నాటి పురాతన పుస్తకాలు ఉన్నప్పటికీ అవి ఎవరికి ఉపయోగం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రంథాలయానికి కొత్త భవనం నిర్మించడంతో పాటు వివిధ పోటీలకు సహితం మెటీరియల్ , ఆన్‌లైన్ సౌకర్యంతో కంప్యూటర్ అందుబాటులో ఉంచాలని పాఠకులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



కొన్నేళ్ల కిందట నిర్మించిన గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా సక్రమంగా లేవు. అధికారులు, ప్రజా ప్రతినిధులు నూతన భవనం నిర్మించి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. చిన్నపాటి వర్షానికి భవనం నుంచి నీరు కారుతోంది. అధికారులు స్పందించాలి.

– ఆదిసోమనాథ్, కోడేరు, పాఠకుడు

రాములమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీటి సరఫరా



దోమలపెంట: నీటి ఎద్దడితో 12 రోజుల నుంచి గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న కటకం రాములమ్మ ఫౌండేషన్ యాజమాన్యం కె.వెంకట్ స్వంత ఖర్చులతో ఫౌండేషన్ నీటి ట్యాంకర్ ద్వారా ఉదయం నుంచి ఇంటింటికి నీటి సరఫరా చేస్తున్నారు. గ్రామస్తులు ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాజీవ్ యువ వికాసం సద్వినియోగం చేసుకోండి



పెంట్లవెల్లి: నిరుద్యోగులు రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ దేవేందర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన అవగాహన కల్పించారు. మీసేవలో ఇబ్బందులు ఉంటే స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఫూలే జయంతి వేడుకలు విజయవంతం చేద్దాం



కొల్లాపూర్: పూలే జయంతి వేడుకలను విజయవంతం చేద్దామని బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక నాయకులు కోరారు. గురువారం పట్టణంలోని మాధవస్వామి దేవాలయ ఆవరణలో వారు సమావేశం అయ్యారు. వేడుకల నిర్వహణ అంశాలపై చర్చించారు. మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను సంఘటితంగా నిర్వహించాలని నిర్ణయించారు. వేడుకలకు అన్ని పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు హాజరుకావాలని వారు కోరారు. సమావేశంలో నాయకులు గాలియాదవ్, చంద్రశేఖరాచారి, మేకల రాముడుయాదవ్, బోరెల్లి సంగెం, కట్టా రాజేందర్‌గౌడ్, రామస్వామియాదవ్, పుట్టపాగ రాము, తాటికొండ కృష్ణ, సురేందర్‌సింగ్, నాగులపల్లి లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

కొత్తకోట రూరల్: బాల్యవివాహాలను ప్రోత్సహించినా, పిల్లలను పనిలో పెట్టుకున్నా చట్టపరంగా చర్యలు ఉంటాయని జిల్లా బాలల పరిరక్షణ కౌన్సిలర్ స్వరూప అన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో గురువారం కొత్తకోట, మదనాపురం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ, వివిధ అంశాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ కౌన్సిలర్ స్వరూప మాట్లాడుతూ బాల్య వివాహ నిషేధ చట్టం 2006, పోక్సో చట్టం 2012, దత్తత ప్రక్రియ, అనాథ పిల్లలకి అందించే సేవలు గురించి వివరించారు. బాలల హక్కులకు భంగం కలిగితే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 181, 100 ను సంప్రదించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భారతి, కవిత, శాస్త్రవేత్త అనిత పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం



కల్వకుర్తి రూరల్: మండలంలోని వేపూరు సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా గురువారం రథోత్సవాన్ని భక్తిశ్రద్దలతో నిర్వహించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు కొండూరు గోవర్ధన్, మాజీ ప్రజా ప్రతినిధులు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కలెక్టర్ ను సన్మానించిన రైస్ మిల్లర్లు

కల్వకుర్తి రూరల్: కలెక్టర్ బదావత్ సంతోష్‌ను గురువారం సాయంత్రం కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ రైస్ మిల్లర్లు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇటీవల డివిజన్ అధ్యక్షుడిగా ఎంపికై న బిచనీ బాలకృష్ణ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జూలూరు రమేష్ బాబు, డివిజన్ కార్యదర్శి విజయకుమార్, కోశాధికారి రవి, రమేష్, వెంకటేష్, ప్రభాకర్ ఉన్నారు

హనుమాన్ జయంతి ఉత్సవాలు ప్రారంభం



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో గురువారం హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అభిషేకాలతో పాటు 108 కలశాల పూజలు, గోపూజ, ధ్వజారోహణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



చారకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని జీహెచ్‌ఎం భగవాన్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలో గురువారం జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి తిరిగారు. పిల్లలను ప్రభుత్వపాఠశాలలో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు కమాలాకర్, రాజేందర్, రాంభిక్షం , యాదగిరి, డాక్య నాయక్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్దండ: మండలంలోని ఈదమ్మబండతండాకు చెందిన వడ్యావత్ మహిపాల్ ఇటీవల మృతి చెందాడు. గురువారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ లాలునాయక్, మాజీ ఉపసర్పంచ్ రాజునాయక్, నాయకులు మహిపాల్, రమేష్‌నాయక్, తదితరులు ఉన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణంలో నాణ్యత లోపించొద్దు



బల్మూర్: మరుగుదొడ్ల నిర్మాణంలో నాణ్యత లోపించొద్దని ఎంపీడీఓ రాఘవులు, ఏపీఓ సువర్ణలు కోరారు. గురువారం మండల కేంద్రంలోని సంత బజారులో రూ.3 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న స్వచ్ఛ భారత్ మరుగుదొడ్ల నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఇటీవల పనుల్లో నాణ్యత పాటించడం లేదని ఫిర్యాదులు అందాయని ఈ మేరకు పనులను పరిశీలించినట్లు తెలిపారు. దీనిపై ఈజీఎస్ టీఏ పర్యవేక్షణ చేస్తు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకునట్లు ఎంపీడీఓ తెలిపారు.

తైబజారు వేలం రూ.35,500

తిమ్మాజిపేట: మండలంలోని ఆవంచలో గురువారం అధికారులు సంత బజారు వేలం పాట నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ ప్రత్యేకాధికారి, ఏఓ కమల్‌కుమార్, ఎంపీఓ రాములు నాయక్‌ల సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రూ.35, 500లకు గొల్ల సైదులు తైబజారు దక్కించుకున్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



లింగాల: ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం వచ్చి ఉండాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని సూరాపూర్, మగ్దూంపూర్, కొత్త కుంటపల్లి ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బల్మూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కొండనాగుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పరంగి రవి అన్నారు. గురువారం ఎన్‌ఎస్‌ఎస్ వేసవికాల శిబిరంలో భాగంగా నాల్గో రోజు మండలంలోని సీతారాంపూర్‌లో విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు వెంకటయ్య, జాన్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం

తిమ్మాజిపేట: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులు వీచాయి. మండల కేంద్రానికి వచ్చి సమీప గ్రామాలకు వెళ్తున్న వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో మండలంలోని వెంకాయపల్లి, అప్పాజిపల్లి, బావాజిపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాలలో ముసురు వర్షం కురిసింది. మారెపల్లిలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి.

కొల్లాపూర్‌లో ఈదురుగాలులు

కొల్లాపూర్: పట్టణంలో గురువారం రాత్రి ఈదురుగాలులు వీచాయి. ఉరుములు, మెరుపులు మెరిశాయి. చిన్నపాటి జల్లులు కురిశాయి. ఈదురు గాలుల కారణంగా విద్యుత్ సరఫరాలో పలుమార్లు అంతరాయం నెలకొంది. రాత్రంతా చల్లటి గాలులు కొనసాగాయి. ఈదురుగాలుల వల్ల పలుచోట్ల మామిడి కాయలు రాలినట్లు రైతులు వాపోయారు.



మారేపల్లిలో రేకులపై పడిన విద్యుత్ తీగలు

ఓఆర్ఎస్ పాకెట్ల పంపిణీ



వెల్దండ: మండలంలోని రాఘయపల్లిలో జాతీయ ఉపాధి హామీ కూలీలకు గురువారం ఓఆర్‌ఎస్ పాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ ఈశ్వర్‌జీ మాట్లాడుతూ వేసవిలో కూలీలు తగిన జాగ్రతలను తీసుకోవాలన్నారు. ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలు ఉదయం 6 గంటల నుంచి 12 గంటల లోపు పనులు ముగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీశైలం, ఆశావర్కర్లు తదితరులు ఉన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



పెద్దకొత్తపల్లి: పోషకాహారంతో ఆరోగ్యం కలుగుతుందని వాస రాఘవేందర్ అన్నారు. గురువారం వనిత క్లబ్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కల్వకోల్‌లో గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. వాసవీ వనిత అధ్యక్షురాలు గీతారాణి, శ్రీలతలు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వనిత క్లబ్ చైర్మన్ శ్రీదేవి, అధ్యక్షురాలు రాధిక, హారిక, నిర్మల, ఉమా, సౌమ్య, అంజలి పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ



నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని నల్లవెల్లిలో రేషన్‌దుకాణాన్ని గురువారం బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుసిరెడ్డి సుబ్బారెడ్డి సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. అనంతర ఆయన మాట్లాడుతూ గరీబ్ కల్యాణ్ యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి 5 కిలోల సన్న బియ్యాన్ని అందిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ప్రచారాలు చేయడం సిగ్గిచేటన్నారు. కిసాన్ మోర్చా నాయకులు వెంకటరెడ్డి, అశోక్, నరసయ్య, నరేష్, సాయిలు, వెంకటయ్య, బాలకృష్ణయ్య బాలరాజు, వెంకటస్వామి, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



వెల్దండ: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో గురువారం చలివేంద్రాన్ని ఎంపీడీఓ సత్యపాల్ రెడ్డి ప్రారంభించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీఓ లక్ష్మణ్, కార్యదర్శి గిరి, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, నాయకులు తదితరులు ఉన్నారు.

బల్మూర్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఎంపీడీఓ రాఘవులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఓ సువర్ణ, కార్యదర్శి లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ ఎస్‌డీ ఖదీర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫూలే అంబేడ్కర్ స్ఫూర్తితో పోరాటాలు



తెలకపల్లి: ఫూలే, అంబేడ్కర్ స్ఫూర్తితో పోరాటాలు నిర్వహిస్తామని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న అన్నారు. గురువారం మండలంలోని ఆలేరు బోప్పల్లి, గడ్డంపల్లి, రాయిపాకుల గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఆయా గ్రామాల్లో దళితుల కాలనీల్లో సమస్యలు ప్రజా సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో గ్రామాల్లో కుల వివక్షత పాటించడం దారుణమన్నారు. గ్రామాల్లో దళితులకు ఆలయ ప్రవేశం లేకపోవడంతో అమానుషం అన్నారు. వెంకటయ్య, లక్ష్మయ్య, రాములు, హరీష్, రమేష్, కాశన్న, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన బాల్య వివాహం

బిజినేపల్లి: మండలంలోని ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలిక వివాహాన్ని షీటీం బృందం గురువారం నిలిపింది. పరీక్షల అనంతరం తల్లితండ్రులు విద్యార్థులకు వివాహం చేసి చేతులు దులుపుకుంటున్నారని, గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే అధికారులకు సమాచారం అందించాలని షీ టీం సభ్యుడు వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం మైనర్ బాలిక వివాహం అడ్డుకున్న బృందంలో చైల్డ్ లైన్ సభ్యులు మధు, కవితలు ఉన్నారు.

వంట గ్యాస్ ధరలు తగ్గించాలి

బల్మూర్: వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండలంలోని కొండనాగుల, బల్మూర్ నర్సాయపల్లి గ్రామాల్లో సీపీఎం నాయకులు రాస్తారోకోతో నిరసన తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి శంకర్‌నాయక్, నాయకులు లాల్‌అహ్మద్, భాస్కర్, శ్రీరామం, కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.



అచ్చంపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం నాయకుల నిరసన

అచ్చంపేట రూరల్: పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం అచ్చంపేటలో సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఖాళీ గ్యాస్ కుండ ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాములు, సయ్యద్, నిర్మల, సైదా, రజిత పాల్గొన్నారు.

బిజినేపల్లిలో..

బిజినేపల్లి: కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌లపై ధరలను తగ్గించాలని డిమాండు చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్రశేఖర్, శివ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కోడేరులో..

కోడేరు: సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం కార్యదర్శి రవి, మాజీ ఉపసర్పంచ్ కాటం లక్ష్మయ్య, పర్వతాలు, సలేశ్వరం, నర్సింహ్మ, ధర్మయ్య పాల్గొన్నారు

ఖాళీ సిలిండర్ల ప్రదర్శన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండంలో ఖాళీ సిలిండర్‌తో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అశోక్. రైతు సంఘం మండల నాయకులు బాలపీరు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి: పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని గురువారం మండలంలోని కల్వకోల్‌లో ఖాళీ సిలిండర్‌తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి దశరథం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై రూ.50, పెట్రోల్, డీజిల్‌పై రూ. 2లు పెంచి పేదలపై భారం మోపడం సరికాదన్నారు. కార్యక్రమంలో శంకర్, సతీష్, నాగేందర్, వెంకటస్వామి, రేణుకలో పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించకపోతే చర్యలు

బల్మూర్: నాణ్యమైన భోజనం వడ్డించకపోతే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ రాఘవులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నాణ్యత లేని భోజనం అందిస్తున్నారని ఓ విద్యార్థి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం మధ్యాహ్న భోజన సమయంలో ఎంపీడీఓ పాఠశాలను సందర్శించారు. నీళ్ల చారు, నాణ్యత లేని భోజనం చూసి విస్తుబోయారు. పలు సమస్యలను విద్యార్థులు ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. వారంలో రెండు గుడ్లు పెడుతున్నారని వివరించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.